క్లుప్తంగా

సీఎం జగనన్నకు ధన్యవాదాలు

విజయనగరం ఫూల్‌బాగ్‌: యాదవులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించినందుకు ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌రెడ్డికి జిల్లా యాదవ సంక్షేమ సంఘ మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత, తదితరులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళంనకు చెందిన ఎస్‌.రామారావుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఉత్తరాంధ్ర రెండు ఎమ్మెల్సీ స్థానాలు యాదవులకు ఇచ్చిన గొప్పతనం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు.

హెచ్‌బీ శాతం తెలుసుకోవాలి

• డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్‌: గర్భిణులు హిమోగ్లోబిన్‌ (హెచ్‌బీ) శాతాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో గర్భిణులకు జరుగుతున్న హెచ్‌బీ పరీక్షలు పరిశీలించడానికి వచ్చిన స్టేట్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ సౌభాగ్యలక్ష్మితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేయడానికి ఏఎన్‌ఎంలకు ఇటీవల మిషన్లు ఇచ్చారని తెలిపారు. వాటితో చేసిన పరీక్షకు, సాధారణ పద్ధతిలో ల్యాబ్‌ టెక్నీషియన్‌ చేసిన పరీక్షకు తేడాలున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలనలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్‌ జగదీష్‌, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్‌



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

భోగాపురం: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని రావాడ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శైలజారాణి అన్నారు. ఈ నెల 14న పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్‌–14 వాలీబాల్‌ పోటీల్లో విజయనగరం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న రావాడ పాఠశాలకు చెందిన ఎన్‌.సంపత్‌ గణేష్‌తో పాటు బాలికల జట్టులో పాల్గొన్న పి.ప్రజీతలను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీ చిన్నారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధ నివారణకు సహకరించాలి



డీఈసీ మాత్రలు వేయిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్‌: బోధ వ్యాధి నివారణకు ప్రజలు సహకరించాలని సీహెచ్‌ఓ అనూష, హెల్త్‌ సూపర్‌వైజర్‌ నారాయణ కోరారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో సోమవారం పర్యటించి డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బోధ వ్యాధి రహిత సమాజానికి కృషి చేస్తోందని, ప్రభుత్వ లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఒకసారి డీఈసీ మాత్రలు వేసుకోవడం వల్ల బోధ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో పి.ఎం.పాలెం విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు

గంట్యాడ: మండలంలోని పి.ఎం.పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌ పోటీల్లో పతకాలు సాధించారు. కర్నూలులో ఇటీవల నిర్వహించిన పోటీల్లో అండర్‌–14, 17, 19 విభాగాల్లో పాఠశాల నుంచి బాలురు, బాలికలు 11 మంది పాల్గొన్నారు. వీరిలో తేజశ్రీ, త్రివేణి రజత పతకాలు సాధించగా, శ్యామ్‌ సుందర్‌, దిలీప్‌ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.

అవయవదానంపై అవగాహన తప్పనిసరి

• రాష్ట్ర అవయవ దాన కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ రాంబాబు

విజయనగరం ఫోర్ట్‌:

అవయవ దానంపై విస్తత అవగాహన అవసరమని రాష్ట్ర అవయవ దాన కో ఆర్డినేటర్‌, విమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె. రాంబాబు అన్నారు. స్థానిక తిరుమల మెడికవర్‌ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం స్థానిక బాలాజీ జంక్షన్‌ నుంచి తిరుమల మెడికవర్‌ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అవయవ దానం కోసం రాష్ట్రంలో 2,800 మంది జీవన్‌దాన్‌ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని చెప్పారు. ఇందులో 1903 మంది కిడ్నీ మార్పిడి , 789 మంది కాలేయ మార్పిడి కోసం రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని తెలిపారు. కిడ్నీలు పాడైతే కొద్ది రోజులు డయాలసిస్‌ ద్వారా బతికించవచ్చునని చెప్పారు. కాలేయం పాడైతే మార్పిడి ఒక్కటే మార్గమన్నారు. దేశ వ్యాప్తంగా ఏడాదికి ఐదు లక్షల మంది అవయవాలు దొరకక మరణిస్తున్నారని తెలిపారు. బీపీ, సుగర్‌, గుండె జబ్బులున్న వారు అవయవ దానం చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదని తెలిపారు. రాష్ట్రంలో ఏడాదికి 22 వేల నుంచి 28 వేల వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. వీరిలో 14 నుంచి 18 శాతం మంది బ్రెయిన్‌ డెడ్‌ అవుతున్నారన్నారు. అటువంటి వారి నుంచి అవయవదానం కోరవచ్చని చెప్పారు. ఒక బ్రెయిన్‌ డెడ్‌ అయిన వ్యక్తి నుంచి అవయవాలు సేకరించి ఎనిమిది మంది ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. ఇటీవల విశాఖపట్నం నుంచి చిత్తూరులోని పద్మావతి ఆస్పత్రికి గుండె తరలించి ఒకరి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. మూడున్నర గంటల్లో గుండెను చిత్తూరు తీసుకెళ్లడానికి రెవెన్యూ, వైద్యారోగ్య, పోలీస్‌ శాఖలకు చెందిన 1000 మంది వరకు శ్రమించారని తెలిపారు. సమావేశంలో తిరుమల మెడికవర్‌ ఎం.డి డాక్టర్‌ కె. తిరుమల ప్రసాద్‌, డాక్టర్‌ పీఎస్‌వీ రామారావు, డాక్టర్‌ పద్మకుమార్‌, డాక్టర్‌ మహేష్‌, డాక్టర్‌ శ్రీకాంత్‌, ఏఓ నారాయణ పాల్గొన్నారు.

పరిశోధనా దృక్పథం అలవర్చుకోవాలి

• ఐసీఎస్‌ఎస్‌ సదరన్‌ రీజియన్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సుధాకరరెడ్డి



సుధాకరరెడ్డిని సత్కరిస్తున్న సీటీయూ వీసీ ప్రొఫెసర్‌ కట్టిమణి

విజయనగరం అర్బన్‌: కళాశాల స్థాయి నుంచి విద్యతో పాటు పరిశోధనా దృక్పథాన్ని అలవరచుకోవాలని ఐసీఎస్‌ఎస్‌ సదరన్‌ రీజియన్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ బి.సుధాకరరెడ్డి అన్నారు. ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌సైన్స్‌ రీసెర్చ్‌ సదరన్‌ రీజియన్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఏడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశోధనా విద్యార్థులు పరిశోధనకు సంబంధించిన అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను చేసేలా తమను తాము మలచుకోవాలన్నారు. మౌలానా అజాద్‌ నేషనల్‌ ఉర్దూ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, యూజీసీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్‌ మొహమ్మద్‌ మియన్‌ మాట్లాడుతూ, సమాజ ఉపయుక్తమైన అంశాలను, నూతన ఆవిష్కరణలు, సామాజిక స్పృహను కలిగించే అంశాలను పరిశోధనాంశాలుగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్‌ టీవీ కట్టిమణి మాట్లాడుతూ, విద్యా వ్యవస్థకు, సమాజానికి మధ్య అంతరాన్ని తగ్గించాలన్నారు. వెనుకబడిన వర్గాలకు ఉపయుక్తమైన విధంగా విశ్వవిపణిలో ముందుకు నిలిచేలా పరిశోధనలు ఉండాలని.. ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ జాకబ్‌ కళ్లే, సీటీయూ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ బొంతు కోటయ్య, ప్రొఫెసర్‌ టి.శ్రీనివాస్‌, ప్రొఫెసర్‌ శరత్‌ చంద్రబాబు, ప్రొఫెసర్‌ మిశ్రా, డాక్టర్‌ గంగునాయుడు మండల, డాక్టర్‌ మన్నాల ప్రసాద్‌, డాక్టర్‌ పీఎస్‌ లత, తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాసే జ్ఞానార్జనకు తొలిమెట్టు



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

• డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీనివాస శాస్త్రి

విజయనగరం అర్బన్‌: తెలుసుకోవాలనే కుతూహలం కలిగి ఉండగలగడమే జ్ఞానాభివృద్ధికి తొలి మెట్టు అని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీనివాస శాస్త్రి అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్‌ కళాశాలను ఐఐఎస్‌సీ బెంగళూరు శాస్త్రవేత్త రాధాకాంత్‌ పాడేతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధనా రంగంలో ఎదురవుతున్న కొత్త కొత్త అంశాలను అధిగమించడానికి ఉత్సాహవంతులైన అధ్యాపకులు, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్‌ రాధాకాంత్‌ పాడే మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో సంప్రదాయక విద్యాబోధనలు మరుగున పడిపోతాయని తెలిపారు. అధ్యాపకులు ప్రాజెక్ట్‌ల ద్వారా బోధనలు చేయడానికి కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ మజ్జి శశిభూషణరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌, వైస్‌ ప్రిన్సిపాల్స్‌, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కేటాయింపులపై హర్షం



ప్రొఫెసర్‌ లజపతిరాయ్‌

విజయనగరం అర్బన్‌: ఎమ్మెల్సీ పదవులను బీసీలకు అధిక సంఖ్యలో కేటాయించడం హర్షణీయమని పరిపాలనా వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ హనుమంతు లజపతిరాయ్‌ అన్నారు. త్వరలో ఖాళీ అవుతున్న 18 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రతిపాదిస్తూ వైఎస్సార్‌సీపీ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, 18 ఎమ్మెల్సీ సీట్లలో బీసీలకు అత్యధికంగా 11 కేటాయించడం గొప్ప విషయమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడ్డారు.

ఆర్థికంగా ఎదగడం హర్షణీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం బంగారమ్మ

డెంకాడ: పొదుపు సంఘాల మహిళలు బ్యాంక్‌ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడం హర్షణీయమని డీపీఎం బంగారామ్మ, ఏసీ రాజ్‌కుమార్‌ అన్నారు. మండలంలోని గుణుపూరులో రూ.లక్షకు పైబడి బ్యాంక్‌ లింకేజి రుణం తీసుకున్న మహిళలు వాటిని ఎలా సద్వినియోగం చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మండల సత్యవతి, ఏపీఎం విజయలక్ష్మి, సాయి, గాంధీ పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్‌ బంకుల్లో తనిఖీలు



పెట్రోల్‌ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



పూసపాటిరేగ: పెట్రోల్‌బంక్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్‌ భాస్కరరావు, తదితరులు

విజయనగరం రూరల్‌: జిల్లా కేంద్రంలోని పలు పెట్రోల్‌ బంకుల్లో రెవెన్యూ, సివిల్‌ సప్లై అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. కార్పొరేషన్‌ పరిధి రింగురోడ్డులో ఉన్న బంకులను ఏఎస్‌ఓ అశోక్‌, తహసీల్దార్‌ బంగార్రాజు, లీగల్‌ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్‌ రాధాకృష్ణ, సీఎస్‌డీటీ వీవీ జగన్‌ స్టాక్‌, క్వాలిటీ, క్వాంటిటీ, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పెట్రోల్‌ బంక్‌ను తహసీల్దార్‌ ఇ. భాస్కరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్‌ నాణ్యత, సాంద్రతలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ మురళి, ఆర్‌ఐ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూపట్టాలు అందించేందుకు చర్యలు



నెలివాడ దళితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో కొండపోరంబోకు భూమిని సాగుచేసుకుంటున్న దళితులకు పట్టాలు ఇచ్చేలా రెవెన్యూ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో నెలివాడ గ్రామానికి చెందిన దళితులు ఎమ్మెల్యే అప్పలనరసయ్యను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 నుంచి గ్రామంలో సర్వే నంబర్‌ 267లోని 40 ఎకరాల కొండపోరంబోకు భూమిని 58 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని, పట్టాలు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. దళితులకు పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌ ఆర్‌.శంకరరావును ఆదేశించారు.

ఇంటింట కుళాయిలకు రూ.72 లక్షలు

నెలివాడ గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకోసం జేలజీవన్‌ మిషన్‌ పథకంలో భాగంగా రూ.72 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో శ్మశాన వాటికకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు కోరగా.. అందుకు సంబంధించి ప్రతి పాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్‌ జేఈఈ కృష్ణమూర్తికి ఎమ్మెల్యే సూచించారు. ఎంపీపీ చల్ల చలం నాయుడు, రాచకిండాం పీఏసీఎస్‌ త్రిసభ్యకమిటీ చైర్మన్‌ గొల్లు సతీష్‌, ఎంపీటీసీ కొమ్మూ నాగమణి తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

అక్రమ రవాణాపై నిఘా



వ్యాపారులకు హెచ్చరికలు జారీచేస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్‌: నిషేధిత వస్తువుల అక్రమ రవాణా కట్టడికి నిఘా పెట్టామని విశాఖ లైన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ కె. వెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌ ఆవరణలో ఆర్‌పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ అఖిలేష్‌కుమార్‌, ఎస్సై రవివర్మ, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా వంటి నిషేధిత వస్తువుల రవాణాపై పోలీస్‌ శాఖ నిరంతర పర్యవేక్షణ చేస్తోందన్నారు. అనుమానాస్పదంగా కనపడిన వస్తువులు, బ్యాగ్‌లను తనిఖీలు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్‌ హెచ్‌సీ తాలాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఐటీ యాక్ట్‌ కేసుల నమోదు

విజయనగరం క్రైమ్‌: ఐటీయాక్ట్‌ కింద ఆదివారం రెండు కేసులు నమోదైనట్లు వన్‌టౌన్‌ సీఐ బి.వెంకటరావు తెలిపారు. విజయనగరం వన్‌టౌన్‌ పరిధిలో నివాసం ఉంటున్న డాక్టర్‌ మహేంద్రగిరి భోగాపురంలో సివిల్‌ అసిస్టెంట్‌ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన మొబైల్‌కి కెవైసీ అప్‌డేట్‌ చేయించుకోవాలని లేకపోతే బ్యాంక్‌ అకౌంట్‌ ఆగిపోతుందని వచ్చిన మెసెజ్‌కు ఆయన స్పందించారు. లింక్‌ ఓపెన్‌ చేయడంతో పాటు ఓటీపీలు ఎంటర్‌ చేయడంతో ఆయన అకౌంట్‌ నుంచి రూ.5 లక్షల 25 వేలు నగదు విత్‌ డ్రా అయింది. దీంతో ఆయన వన్‌టౌన్‌లో ఫిర్యాదుచేశారు. అలాగే భోగాపురంలో టీచర్‌గా పని చేస్తూ విజయనగరం తోటపాలెంలో నివాసం ఉంటున్న పద్మలతకు బ్యాంక్‌కు సంబంధించిన యాప్‌ లింక్‌ పంపించండంతో ఆమె ఓపెన్‌ చేసి ఓటీపీలను ఎంటర్‌ చేయడంతో ఆమె అకౌంట్‌ నుంచి రూ.లక్షా 5వేలు నగదు విత్‌ డ్రా అయింది. దీంతో ఆమె వెంటనే వన్‌టౌన్‌ పోలీసులకు ఫిర్యాదుచేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్‌ కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.





మెరిసింది..

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ భవనం రంగు మారింది. నాడు వెలవెలబోయిన భవనానికి తాజాగా రంగులు వేయడంతో కనువిందు గొలిచేలా మెరుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయనగరం

Bhavani College of Education
krishnapuram, Boddavalasa Panchayat, Denkada mandalam, Vizianagaram district , Pincode : 535005, Andhra Pradesh.
Phone: 9502869067, 9705825383, 9440541974

B.Ed Management Quota (Category-B)2022-2024

Applications are invited from qualified students (with or without Edcet-2022) who have complete their graduation with 50%for OC and 45% for reserve castes like SC/ ST/BC. Candidate may seek admissions Category-B Seats in all Methodologies (Maths, Physics, Biology, Social, English) interested candidates may meet the principal along with the Original certificates immediately.

Date of Admission : 28-02-2023 (Tuesday)

Date:20-02-2023 Sd/- Principal







